నైతిక విలువలు గొప్పవి : డిఇఒ

ఉండి: విద్యార్థులకు విద్య కన్నా నైతిక విలువలే గొప్పవని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వి.రమణ అన్నారు. మంగళవారం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయిని కె.బేబీ అధ్యక్షతన ఐక్య నేషనల్ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఇఒ ఆర్‌వి రమణ, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైతిక విలువలే ఎదుటివారిని గౌరవించే సంస్కారం నేర్పుతాయన్నారు. ఐక్య నేషనల్ ఫౌండేషన్ వార్షిక నివేదికను కార్యదర్శి చంద్రాజీ వినిపించారు. అనంతరం విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పూర్వ విద్యార్థులు పి.సుబ్బారావు, గోవాడ శేషు, విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నల్ల సత్య కృష్ణ కిరణ్‌ప్రసాద్‌ను ఐక్య నేషనల్ ఫౌండేషన్ ఛైర్మన్ ముదునూరి శివరామరాజు సత్కరించారు. నాయకులు రణస్థుల మహంకాళి, ఉపాధ్యాయులు రవివర్మ, ఆనంద్, బెనర్జీ, గజపతిరాజు, గాదిరాజు రంగరాజు, ఎం.రామకృష్ణారావు ప్రతిభా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు.



అన్నదాత ఆందోళన..!

ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు అన్నదాత పడుతున్న పాట్లు అంతా ఇంతా కాదు. ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తామని చెబుతున్నప్పటికీ అది పూర్తిస్థాయిలో అమలు జరగడం లేదు. దళారులు, మధ్యవర్తులు ధాన్యం కొనుగోలులో కీలకపాత్ర వహిస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం ఆ వైపు దృష్టి సారించడం లేదు. దీనికి తోడు ఇటీవల పౌర సరఫరాల సంస్థ తాజాగా విడుదల చేసిన గోడ పత్రికపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవ్వడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. ఈ నేపథ్యంలో ధాన్యం అమ్మకాలకు మిల్లర్లే దిక్కైన పరిస్థితి ఏర్పడింది. రైతులు పండించిన ప్రతి గింజా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్ చేస్తోంది.

ధాన్యం అమ్మకాలపై వీడని సందిగ్ధత
15 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం
పౌర సరఫరాల సంస్థ తాజాగా విడుదల చేసిన వాల్‌పోస్టర్ పై భిన్నాభిప్రాయాలు
రబీ ధాన్యం ధరలు ప్రకటించిన కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల పాత్ర తీసేస్తున్నాం. దళారులు, మధ్యవర్తులకు ఎలాంటి స్థానం లేదు. రైతు భరోసా కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి. రైతు పండించిన ప్రతి గింజా ప్రభుత్వమే కొంటుంది. పారదర్శకంగా ధాన్యం సేకరణ ప్రక్రియ సాగుతుందని ధాన్యం కొనుగోలు ప్రారంభమైన ప్రతిసారీ ప్రభుత్వం ఇదే చెబుతోంది. ఇప్పుడు పౌర సరఫరాల సంస్థ అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతు పండించిన ధాన్యాన్ని ఆర్‌బికెల ద్వారా మాత్రమే అమ్మాలనే నిబంధన లేదు. కనీస మద్దతు ధర, అంత కన్నా ఎక్కువ ధర బయట నుంచి రావాలన్నదే మా తపన. ఎంఎస్‌పి కంటే అధిక ధర లభిస్తే రైతు తన ధాన్యాన్ని వ్యాపారులకు, మిల్లర్లకు అమ్ముకునే స్వేచ్ఛ ఉంది. అయితే సమాచారం కోసం వివరాలను ఆర్‌బికెలకు తెలియజేస్తే చాలని పౌర సరఫరాల సంస్థ 2023-24 రబీ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తాజాగా విడుదల చేసిన గోడ పత్రికల్లో పేర్కొంది. గత ఖరీఫ్‌లో మాదిరిగానే ప్రస్తుత రబీ ధాన్యం సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం గతేడాది మాదిరిగానే ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు పౌర సరఫ రాల సంస్థ రైతులకు సమాచారం ఇచ్చింది. అయితే కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కంటే ఎక్కువ ధర బయట ఉంటే నేరుగా అమ్ముకునే స్వేచ్ఛ అన్నదాతలకు ఉందని స్పష్టం చేసింది. ఆర్‌బికెల్లో అమ్ముకునే రైతులకు రవాణా ఖర్చులు, లేబర్ ఛార్జీలు ఇచ్చి, ఉచితంగా గోనె సంచులు సరఫరా చేస్తామని తెలిపింది. దీంతో ధాన్యం అమ్మకాలు చేసుకునేందుకు రైతుకు రెండు మార్గాలున్నా మిల్లర్లు మద్దతు ధర ఇస్తారన్న గ్యారంటీ లేక ప్రభుత్వానికే విక్రయించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అయితే గత ఖరీఫ్‌లో సేకరణ లక్ష్యాన్ని కుదించిన ప్రభుత్వం పూర్తిగా ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా చేతులెత్తేయడంతో అన్నదాతలు నష్టపోయారు. పారదర్శకత పేరుతో ఆర్‌బికెల్లో అమలు చేసిన కొనుగోలు విధానం రైతులకు పెద్దగా మేలు చేయలేదు. తడిసిన ధాన్యాన్ని కొంటామన్న ప్రభుత్వం నిర్ణీత మోతాదుకు మించి తేమ శాతం ఉంటే తూకం తగ్గించారు. అదే సమయంలో ఆర్‌బికె టెక్నికల్ అసిస్టెంట్ తేమశాతం నిర్ధారించాక సదరు రైతుకు కేటాయించిన మిల్లులో పాత పరికరాలతో మళ్లీ తేమ శాతం చూసి, నిమ్ము ఎక్కువ చూపి, క్వింటాకు రూ.250 వరకూ కోత పెట్టారు. దీంతో రైతులు రూ.వేలల్లో నష్టపోయారు. పైగా పండించిన ధాన్యం అంతా కొనకపోవడంతో మిల్లర్లకే అమ్ముకోవాల్సి వచ్చింది. ఇప్పుడు దాళ్వా ధాన్యం విష యంలోనూ ఆర్బీకేల ద్వారా కొంటామని చెబుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో సుమారు లక్షా 80 వేల ఎకరాల్లో రైతులు సాగు చేపట్టారు.

ఉమ్మడి జిల్లాలో సుమారు మూడు లక్షల ఎకరాలకు పైబడి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి కోతకొచ్చింది. తాడేపల్లిగూడెం, నరసాపురం వంటి ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెలాఖరుకు కోత, నూర్పిడి ముమ్మరం కానుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 15 నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. అయితే గత ఖరీఫ్ మాదిరిగానే ఈసారి కూడా ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు దిగాలు చెందుతున్నారు. కొనుగోళ్లలో సవాలక్ష నిబంధనలు పెట్టి మానసిక, ఆర్థిక ఇబ్బందులకు ప్రభుత్వం గురి చేస్తుందని రైతులు వాపోతున్నారు. ఈ సీజన్‌లో కూడా రైతులకు మిల్లర్లే దిక్కైన పరిస్థితి ఏర్పడింది. గతంలో మాదిరిగానే రైస్ మిల్లుల వద్ద ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఇదిలా ఉంటే ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం ఒకటి చెబుతుంటే పౌర సరఫరాల సంస్థ మరొకటి చెబుతుండడంతో అమ్మకాలపై రైతుల్లో సందేహం నెలకొంది.

రబీ ధాన్యం ధరలు నిర్ణయం

భీమవరం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఇటీవల రబీ ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్షించి ప్రభుత్వం నిర్ణయించిన ధరలను ప్రకటించారు. 100 కిలోల కామన్ రకం రూ.2,040, ఎ.గ్రేడ్ రకం రూ.2,060, 75 కేజీల కామన్ రకం రూ.1530, ఎ గ్రేడ్ రకం రూ.1545 చొప్పున రైతుల నుండి కొనుగోలు చేయనున్నారు. ధాన్యంలో మట్టి, రాళ్లు, ఇసుక మొదలగునవి ఒక శాతం, గడ్డి, చెత్త, తప్ప, కొలుపు విత్తనాలు ఒక శాతం, దెబ్బతిన్న, రంగు మారిన, మొలకెత్తిన, పురుగు పట్టిన ధాన్యం ఐదు శాతం, రంగు మారిన గింజలు కాకుండా మిగిలిన పైన పేర్కొనబడిన మూడు రకాలు గింజలు మొత్తం నాలుగు శాతం, పరిపక్వం, ముడుచుకొని పోయిన, వంకర తిరిగిన ధాన్యపు గింజలు మూడు శాతం, తక్కువ శ్రేణి ధాన్యపు గింజలు, కేళీలు 6 శాతం, తేమ లేక నిమ్ము 17 శాతం ఉండే ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకున్నారు.

ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలి
కౌలు రైతు సంఘం

జిల్లాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వమే పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దళారీలు, మిల్లర్ల దోపిడీ నుంచి కౌలు రైతులను కాపాడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. గత సార్వాలో ధాన్యం కొనుగోళ్ల సమయంలో ప్రభుత్వం టార్గెట్ అయిపోయిందని, సంచులు లేవని రైతులు పట్టిన ధాన్యాన్ని నెలలు తబడి ట్రాక్టర్లు పైన, కళ్లాలల్లో వదిలేశారని గుర్తు చేశారు. దీంతో కౌలురైతులు ఇబ్బంది పడ్డారన్నారు. రబీ ధాన్యం కొనుగోళ్లలోనైనా సంచుల కొరత, టార్గెట్, బ్యాంకు గ్యారెంటీ వంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు.

జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

చిరస్మరణీయులు జ్యోతిరావు పూలే

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

మహాత్మా జ్యోతిరావు పూలే జాతికి చేసిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. జ్యోతిరావు పూలే 197వ జయంతిని మంగళవారం కలెక్టరేట్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి జిల్లా కలెక్టర్ నివాళులర్పించి మాట్లాడారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కృషిచేసిన జ్యోతిరావు పూలే గొప్ప మహనీయుడని కొనియాడారు. బాలికా విద్యకు ఆయన ఎంతో ప్రాధాన్యతిచ్చారని తెలిపారు. బాలికల కోసం, వెనుకబడిన వర్గాల కోసం పాఠశాలలు స్థాపించారని చెప్పారు. ఇన్‌ఛార్జి జెసి, నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ మాట్లాడుతూ అప్పటి సామాజిక రాజకీయ పరిస్థితుల్లో తన భార్యకు విద్యనేర్పించి దేశంలో మహిళల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించిన గొప్ప వ్యక్తిని అన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య మాట్లాడుతూ జ్యోతిరావుపూలే సేవలు చిరస్మరణీయమన్నారు. డిఆర్‌ఒ కె.కృష్ణవేణి మాట్లాడుతూ సమాజంలో ఉన్న అసమానతలపై ఆయన ఎంతో పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, జిల్లా బిసి సంక్షేమాధికారి గణపతిరావు, జిల్లా అధికారులు, బిసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్ర యూనిట్లు త్వరతగతిన మంజూరు చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఫిష్ ఆంధ్ర యూనిట్లు త్వరితగతిన మంజూరు చేయాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టరు ఫిష్ ఆంధ్ర యూనిట్ల ఏర్పాటుపై సమీక్షించారు. ఇప్పటికే గుర్తించిన లబ్ధిదారులకు రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. ఫిష్ ఔట్లెట్స్ ఏర్పాటుకు అనువైన స్థలాలను క్షేత్రస్థాయిలో గుర్తించే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే గుర్తించిన ఒక్కొక్కటీ రూ.లక్ష విలువగల 245 ఫిష్ ఔట్ లెట్స్‌లో 190 పూర్తి దశకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అదే విధంగా రూ.10 లక్షల విలువైన యూనిట్లు 16 గుర్తించారని, రూ.20 లక్షల యూనిట్లు నాలుగు గుర్తించారని వీటిని త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఫిష్ కియోస్కీలు, టూ వీలర్స్ యూనిట్లు, త్రీవీలర్ యూనిట్లు, ఆక్వా ల్యాబ్ పెట్టుకునే వారిని గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్, ఇన్‌ఛార్జి జిల్లా మత్య శాఖ అధికారి కె.మురళీకృష్ణ, హార్టికల్చర్ ఎడిఎ దుర్గేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

జ్యోతిరావు పూలే జీవితం నేటి తరానికి ఆదర్శం

పూలేకు సిపిఎం, యుటిఎఫ్, డివైఎఫ్ఐ, కెవిపిఎస్ నేతల నివాళి

ప్రజాశక్తి - భీమవరం

మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో పూలే జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం బలరాం మాట్లాడుతూ భారతదేశంలోనే ప్రముఖ సంఘ సంస్కర్త, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడు మహాత్మా జ్యోతిరావు పూలే అన్నారు. విద్య సంస్కరణల కోసం పోరాడిన యోధుడన్నారు. సామాజిక న్యాయం కోసం నిలబడిన మహనీయుడన్నారు. నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామాజిక న్యాయానికి తీరని ద్రోహం చేస్తోందని విమర్శించారు. అట్టడుగు, బలహీన వర్గాల దళితులు, గిరిజనులు, మహిళలపై ఇటీవల కాలంలో దాడులు పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ హయాంలో కూడా దాడులు పెరుగుతున్నాయన్నారు. వీటిపై అందరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, రఫెల్ పాల్గొన్నారు.

భీమవరం : సమాజంలో వేళ్లూరుకుపోయిన కుల వివక్షపై యువత, విద్యార్థిలోకం ఐక్యంగా పోరాడాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జ్యోతిరావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్ శర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వై.రాము మాట్లాడుతూ సమ సమాజం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు పూలే అన్నారు. సమాజంలో కులపరమైన వివక్షతను, అన్యాయాలను రూపుమాపడం కోసం జీవిత చరమాంకం వరకూ పోరాటం చేసిన మహనీయుడు పూలే అన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.ధనుష్, జిల్లా కమిటీ నాయకులు బి.రాంబాబు, డోకల రవితేజ, కేతా ప్రమోద్, పిల్లి చంటిబాబు, పి.వాసు, రాపాక రమేష్, బి.బాలాజీ పాల్గొన్నారు.

పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బలరాం, నేతలు

మహాత్మ జ్యోతిరావు పూలే స్ఫూర్తితో అన్ని రకాల అసమానతలపై దళిత, బహుజనులందరూ ఐక్యంగా పోరాడాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై రాము, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు పిలుపునిచ్చారు. జ్యోతిరావు పూలే జయంతిని కెవిపిఎస్ ఆధ్వర్యంలో గునుపూడి అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.వాసు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కింతాడ రమేష్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు రాపాక రమేష్, పిల్లి చంటిబాబు, ఎస్‌ఎఫ్ఐ పట్టణ నాయకులు గణేష్, నాయకులు చంటి, ఆశీర్వాదం పాల్గొన్నారు.

భీమవరం : మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని యుటిఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమనికి ముఖ్య అతిథిగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించి మాట్లాడారు. జ్యోతిరావు పూలే అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేశారని గుర్తు చేశారు. మహిళలు చదువుకోవడం నేరం అనే రోజుల్లో తన భార్య సావిత్ర బాయి పూలేకు చదువు నేర్పి భారత దేశపు మొదటి ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు రామకృష్ణ ప్రసాద్, కుమార్, రామకృష్ణంరాజు, ఏసుబాబు, రామానుజరావు, నాగబాబు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం రూరల్

శ్మశానవాటిక, పార్కులు, రోడ్లు, డ్రెయినేజీలు తదితర అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విఫ్ ముదునూరి.ప్రసాదరాజు అన్నారు. స్థానిక శాసన సభ్యుల కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పట్టణ అభివృద్ధికి సంబంధించి మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ జయరాజు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలన్నారు. ఏ ఒక్క వార్డులో పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ప్రజలు, కౌన్సిలర్ల నుంచి ఏ ఒక్క ఫిర్యాదూ రాకూడదన్నారు. అవసరాన్ని బట్టి పారిశుధ్య కార్మికుల ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా పారిశుధ్య కార్మికులు సరిగ్గా విధులు నిర్వహించకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలన్నారు. పనులకు నిధులు లోటు లేదన్నారు. మున్సిపాల్టీలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా నిర్వహణ జరగాలంటే ముందుగా డ్రెయినేజీలో పేర్కొన్న సిల్టును తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పందులు, కుక్కల స్వైర విహారాలు పూర్తిగా నియంత్రించాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.62 కోట్లు పట్టణంలో ఖర్చు చేయబోతున్నామని, టెండర్లకు పిలిచామని తెలిపారు. పురపాలక రెవెన్యూ ఆదాయం పెరిగేందుకు మెరుగైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పట్టణంలో విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలన్నారు. పట్టణ పరిధిలో గోదావరి వద్ద ఉన్న శ్మశానవాటిక అభివృద్ధికి సుమారు రూ.2 కోట్ల 50 లక్షల నిధులతో ప్రహరీ గోడ, షెడ్, రహదారి నిర్మాణం తదితర అంశాలపై ఖర్చు చేశామన్నారు. పట్టణాన్ని అభివృద్ధి చేసి ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్ కామన నాగిని, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు భూసరపు జయప్రకాష్ పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులివ్వకుంటే

దశలవారీ పోరాటం చేస్తాం

అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం హెచ్చరిక

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం మండలంలో గ్రామ పంచాయతీలకు ఇవ్వాల్సిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు వెంటనే ఇవ్వాలని లేని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వంపై దశలవారీ పోరాటం చేస్తామని అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం హెచ్చరించింది. వీరవాసరంలో అఖిల పక్ష రౌండుటేబుల్ సమావేశం సిపిఎం నాయకులు జుత్తిగ నరసింహమూర్తి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. పంచాయతీలో నిధులు లేక అధికార పక్ష సర్పంచులే చెప్పుతో కొట్టుకోవాల్సిన పరిస్థితులను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. స్థానిక సంస్థల అధికారాన్ని, నిధులను నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వం ముందుకెళితే సహించేదిలేదని ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని నాయకులు స్పష్టం చేశారు. పంచాయతీ నిధుల సమస్యపై సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 8న చేపట్టిన ఒక్క రోజు శాంతియుత దీక్షను ప్రభుత్వం పోలీసులతో భగ్నం చేయించడాన్ని సమావేశం ఖండించింది. పంచాయతీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడుకోవడం వల్ల పంచాయతీలను కేంద్ర ప్రభుత్వం బ్లాక్‌లిస్టులో పెట్టడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఐదో ఆర్థిక సంఘం ఏర్పాటు చేయకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం ఆర్థిక సంఘం నిధులు ఇవ్వలేమని చెప్పటం బాధాకరమన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వకపోయినా, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు వాడుకోవడాన్ని సర్పంచులు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం రూ.7659 కోట్ల నిధులను పంచాయతీ ఖాతాల్లో జమచేయాలని సమావేశం డిమాండ్ చేసింది. పంచాయతీల్లో నిధుల్లేక ఏ పనీ చేయలేకపోతున్నామని, కనీసం శానిటేషన్, ముగ్గు చల్లించేందుకు డబ్బులు లేని పరిస్థితులున్నాయని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమ చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో జనసేన మండలాధ్యక్షుడు గుండా రామకృష్ణ, టిడిపి మాజీ ఎంపిపి వీరవల్లి చంద్రశేఖర్, సర్పంచులు వేంద్ర లీలాకృష్ణ, యర్రంశెట్టి నాగసాయి, ఎంపిటిసిలు గోడి ఆదిలక్ష్మి, వాసాల వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు రెడ్డి రామారావు, బొంతు రామారావు, గొట్టుముక్కల శ్యాంబాబు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జనసేన మండలాధ్యక్షుడు గుండా రామకృష్ణ

ఫిర్యాదులపై విచారణ

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలోని మోగల్లు, గొరగనమూడి గ్రామ పంచాయతీలకు నుంచి వచ్చిన రెండు ఫిర్యాదులపై పంచాయతీ విస్తరణాధికారి వి.రెడ్డియ్య మంగళవారం విచారణ చేశారు. మోగల్లు గ్రామంలోని సుబ్బరాజు చెరువు, ఊరచెరువుల్లో పంచాయతీ అధికారులు ఎటువంటి తీర్మానాలు లేకుండా చేప పిల్లలు వేశారని, అనంతరం తీర్మానాలు చేసిన వెంటనే బిల్లుల రూపంలో రూ.1.20 లక్షలు మంజూరు చేశారంటూ ఇరువురు వార్డు సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంచాయతీ విస్తరణ అధికారి రెడ్డియ్య విచారణ చేశారు. గొరగనమూడిలో వాలంటీరుగా పని చేస్తున్న ఓ వ్యక్తి విధులు సరిగ్గా నిర్వహించకుండా ఓ టీవీ ఛానల్ విలేకరులు తనకు తెలుసంటూ నిర్లక్ష్యంగా వ్యవహిస్తోందని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేశారు. నివేదికలను ఎంపిడిఒ ఎన్.మురళీ గంగాధరరావుకు అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గొట్టుముక్కల వెంకట శివరామరాజు, కృష్ణకుమారి పాల్గొన్నారు.



మోగల్లు పంచాయతీలో విచారణ చేస్తున్న ఇఒపిఆర్‌డి

జీవన్ జ్యోతి బీమా యోజనలో భాగస్వాములవ్వాలి

జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి

ప్రజాశక్తి - భీమవరం

వివిధ బ్యాంకుల్లో ఖాతాలు కలిగిన వారు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాల్లో భాగస్వాములు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల వయసు గలవారు ఇన్సూరెన్స్ సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే సాధారణ మరణం సంభవిస్తే రూ.2 లక్షల వరకూ ఇన్సూరెన్స్ కవరేజ్‌ని నామినీకి చెల్లించడం జరుగుతుందని తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకాల నమోదును ఆమె సమీక్షించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల్లో నమోదుకు ప్రత్యేక క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద 18 నుండి 70 సంవరాల వారు రుసుం సంవత్సరానికి రూ.20 చెల్లించినట్లయితే ప్రమాదవసాత్తూ మరణిస్తే రూ.2 లక్షలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం వెంకటరమణ, డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్, డిపిఒ ఎం.నాగలత, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పరిరక్షణకు పోరాడాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఉపాధి హామీ పరిరక్షణకు కూలీలందరూ పోరాటానికి సిద్ధం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల కిరణ్ వీరభద్రరావు అన్నారు. మంగళవారం తణుకు మండలం తేతలిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలుసుకుని వారితో మాట్లాడారు. అనంతరం వీరభద్రరావు మాట్లాడుతూ ఉపాధి హామీ వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాలలో కూలీలు ఉపాధి పనులు చేయడానికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని, దీంతో వ్యవసాయ పనులు చేయడానికి రావడంలేదని భూస్వాముల కూలీల కొరత ఏర్పడిందని గ్రామాల్లో కొంతమంది పెద్దలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇది సరికాదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పని అడిగిన ప్రతి కుటుంబానికి పని కల్పించాలని, పని ప్రదేశంలో చనిపోయిన కూలీలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మారెం వీరాస్వామి, వీరపల్లి దుర్గాభవాని, కోట మోహన్‌రావు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గర్భిణులకు రక్త పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గర్భిణులు ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవమై ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని గణపవరం పిహెచ్‌సి డాక్టర్లు పి.సంతోష్‌నాయుడు, పి.కిరణ్మయి అన్నారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 68 మంది గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ నెలలు నిండిన మహిళలు ప్రభుత్వాసుపత్రిలోనే పురుడు పోసుకోవాలన్నారు. ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లకుండా స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో పురుడు పోసుకునే విధంగా మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ జలాది విల్సన్‌బాబు, వైద్య సిబ్బంది కమల, ఆశాలు జి.ప్రవంతి, పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ :మండలంలోని లంకలకోడేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం ప్రభుత్వ డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వారికి సంబంధించిన రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత పోషకాహార లోపంతో ఉన్నవారికి ఐరన్ మాత్రలు ఇస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందించే పోషకాహారాన్ని తీసుకోవాలని వారికి సూచించారు.

కాళ్ల : ప్రతి గర్భిణీ ముందస్తు దశలోనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డాక్టర్ గులాల్ రాజ్ కుమార్ కోరారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాతృ సంరక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం గర్భిణులకు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

'నూతన ఒరవడికి జగన్ శ్రీకారం'

ప్రజాశక్తి - ఆచంట

పాలనలో నూతన ఒరవడికి ముఖ్యమంత్రి జగన్ శ్రీకారం చుట్టారని వైసిపి రాష్ట్ర కార్యదర్శి పెద్ద కిషోర్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆచంట పంచాయతీ పరిధి మానేపాటి పాలెంలో 'నువ్వే మా భవిష్యత్' కార్యక్రమం ఐదో రోజు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక ప్రయోజనం కల్పించి పేదరికాన్ని రూపు మాపడమే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ పెచ్చెటి సత్యనారాయణ, కామన హరిబాబు, గుత్తుల రామకృష్ణ, ఎ.వినయ్, పిల్లి జయరామ కృష్ణ, గుబ్బల రామకృష్ణ, సానబోయిన సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆగర్తిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఆగర్తిపాలెంలో డాక్టర్ నవ్య జీవన్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ పి.వరప్రసాద్ కార్యక్రమాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి పేదవాడికి వైద్య సేవలందించడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో కె.ప్రభాకర్, ఎంఎల్‌హెచ్‌పి బూసి దేవి, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - తణుకు రూరల్

2023 ఫిబ్రవరి నెలలో స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పిజి(అటానమస్)లో జరిగిన డిగ్రీ ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్, తృతీయ సంవత్సరం ఐదో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను మంగళవారం కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరం మూడో సెమిస్టర్ 582 విద్యార్థినులకు 455 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. తృతీయ సంవత్సరం ఐదో సెమిస్టర్ 493 విద్యార్థినులకు 438 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. పరీక్షా ఫలితాలను సకాలంలో విడుదల చేసినందుకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కెవి.రామకృష్ణ, అసిస్టెంట్ కంట్రోలర్ ఎన్ఎస్‌విఎన్ఎ కుమార్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ట్రెజరర్ నందిగం సుధాకర్, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థినులను అభినందించారు.

ఘనంగా కస్తూరిబాయ్‌గాంధీ జయంతి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కాళీపట్నం పడమర కస్తూరిబాయ్ గాంధీ జయంతి వేడుకలను ఆరోగ్య వర్షిని వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడారు. ఆమె తన భర్త ప్రోత్సాహంతో కుమారునితో పాటు భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొందన్నారు. మహాత్మ గాంధీజీతో ఎన్నో ఉద్యమాల్లో పోరాటాల్లో పాల్గొని భవిష్యత్ తరాలకు ఉద్యమ స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ కార్యదర్శి నాగిడి రాంబాబు, కవూరు రంగా, పొడి సత్యనారాయణ, కడలి పోతురాజు, బొక్క వెంకటేశ్వరరావు, మొక ఏడుకొండలు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

కళాశాల ఫీజులు కట్టలేని విద్యార్థిని పాలకొల్లు కాపు సంఘం నేతలు ఆదుకున్నారు. పట్టణానికి చెందిన అడబాల మౌనికకు పాలకొల్లు కాపు సంఘం తరపున మంగళవారం గాంధీబొమ్మ సెంటర్ శ్రీ కృష్ణ దేవరాయలు విగ్రహం వద్ద రూ.పది వేలు ఆర్థిక సహకారం అందించారు. గాది అంజనేయులు, యలమంచిలి మండల కాపు సంఘం నేత నారిన మురళి, ఉనికిల శ్రీనివాస్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వంగా నరసింహరావు ఆర్థిక సహకారంతో ఈ మొత్తాన్ని అందించారు.

వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - ఆచంట

దేశంలోని రైతాంగం వ్యవసాయ నల్ల చట్టాల రద్దు కోసం ప్రాణాలర్పిస్తూ పోరాడుతుంటే కేంద్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇందుకూరి సూర్యనారాయణ రాజు అన్నారు. వల్లూరులో ఆల్ ఇండియా రైతు సంఘం ఏర్పడి 87 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వల్లూరు రైతు సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పాలిట శాపంగా మారిన వ్యవసాయ నల్ల చట్టాలను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశానికి అన్నం పెడుతున్న రైతాంగం పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత హేయమైనదని విమర్శించారు. వ్యవసాయ చట్టాల అమలు దేశ ఆహార భద్రతకు పెను ప్రమాదంగా తీసుకొచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎర్రింకి ప్రకాశరావు, గుడాల శ్రీరాములు, పెచ్చెట్టి సత్యనారాయణ, పిల్లి శ్రీరాములు, బెజవాడ శ్రీనివాస్, బొర్రా ధర్మారావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇందుకూరి సూర్యనారాయణ రాజు

ప్రజా సంక్షేమం కోసమే పథకాలు

డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజల కోసమే సంక్షేమ పథకాలు సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు తెలిపారు. కోపల్లె గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తొలుత మండల ప్రజా పరిషత్ నిధులు రూ.3 లక్షలతో సీసీ డ్రెయినేజీ నిర్మాణానికి నరసింహరాజు శంకుస్థాపన చేశారు. గ్రామంలో పెద్ద ఎత్తున మహిళలు ఆయనకు హారతులిచ్చారు. ఈ సందర్భంగా పివిఎల్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీసి మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే తన దృష్టికి తెచ్చినట్లయితే వారికి పథకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, జిల్లా సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, కోపల్లె ఉప సర్పంచి బూడి వెంకట పరాలు, మాలవానితిప్ప సర్పంచి సాగిరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

డ్రెయినేజీ శంకుస్థాపన చేస్తున్న పివిఎల్ నరసింహరాజు

బాధితునికి కొవ్వలి ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - మొగల్తూరు

ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకే కొవ్వలి ఫౌండేషన్‌ను ఎత్తి రాజారామ్మోహన్ నాయుడు స్థాపించారని సంస్థ కోశాధికారి జయలక్ష్మి అన్నారు. కెపిపాలెం గ్రామానికి చెందిన ఈవన రాధాకృష్ణ ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యారు. ఈ క్రమంలో నడుం విరిగి లేవలేని పరిస్థితిలో ఉన్నారు. గ్రామానికి చెందిన పలువురు రాధాకృష్ణ పరిస్థితిని కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ యతిరాజ రామ్మోహన్ నాయుడుకు తెలిపారు. ఆయన స్పందించి రాధాకృష్ణకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, మందులు సంస్థ కోశాధికారి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి బి.ఏడుకొండలు, చినమిల్లి రాధ, కుమ్మరపురుగు బోసు, గన్నాబత్తుల నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శిరగాలపల్లిలో 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని శిరగాలపల్లి గ్రామంలో మంగళవారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి గ్రామస్తులకు తెలిపారు. ఆయన వెంట గ్రామ సర్పంచి చిలుకూరి సుబ్బారావు చౌదరి, గ్రామ అధ్యక్షులు వీరవల్లి నరసింహమూర్తి, సజ్జ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉండి : మండల వ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైసిపి నాయకులు వేగవంతం చేశారు. మంగళవారం వెలివర్రు గ్రామంలో నిర్వహించారు. అనంతరం వైసిపి నాయకులు ముదునూరి కొండరాజు, కల్లేపల్లి సతీష్‌రాజు మాట్లాడుతూ ప్రభుత్వంపై నూటికి 90 మందిలో సంతృప్తితో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఈదా ఎడ్వర్డ్ జాన్సన్, జాలి యాకోబు, ఎలమదుర్తి ఆశీర్వాదం, రుద్రరాజు సంజీవరాజు పాల్గొన్నారు.

యండగండిలో ఉపాధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉండి

యండగండి గ్రామ పంచాయతీ పరిధిలో 140 మంది కూలీలతో ఉపాధి హామీ పనులు ప్రారంభించినట్లు గ్రామ సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఉపాధి హామీ పనులు ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఉపాధి హామీలో పని అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు ఇస్తున్నామన్నారు. వేసవికాలం నేపథ్యంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దష్ట్యా ప్రతి ఒక్కరూ ఉదయం 6 గంటల నుండి పనిలో ఉండాలని సర్పంచి సూచించారు. కాలువలు, చెరువుల్లో తూడు, గుర్రపుడెక్క వంటి చెత్త చెదారాలను తీసి శుభ్రం చేయాలన్నారు.

మంగన్న జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అమరజీవి బొరుసు మంగన్న 73వ వర్ధంతి దండగర గ్రామంలో మంగళవారం బోరుసు మంగన్న స్తూపం వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ వీరులు మరణించినా జనం గుండెల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారని అనడానికి బోరుసు మంగన్న జీవితమే ఆదర్శమన్నారు. 1950లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టులపై నిషేధం విధించి జిల్లాలో తుపాకీలతో కాల్చి చంపిన 16 మంది నాయకుల్లో బొరుసు మంగన్న ఒకరని తెలిపారు. ఆయన భూమి కోసం భుక్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం ఆనాడు కమ్యూనిస్టులు పోరాటం చేసి పేదలకు భూములు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీదేనని తెలిపారు. దేశానికి సోషలిజమే సరైన మార్గమన్నారు. దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ఆర్ఎస్ఎస్ మతోన్మాద చిచ్చును రగిలించి హిందుత్వాన్ని రెచ్చగొట్టి దేశ ప్రజల మధ్య అనైక్యత పెంపొందిస్తుందన్నారు. ఐక్య ఉద్యమాలతో బిజెపికి బుద్ధి చెప్పాల్సిన పని ఉందన్నారు. అందుకోసం కమ్యూనిస్టు ఉద్యమాలు బలపడాలని కమ్యూనిస్టు పార్టీల వైపు ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కర్రి సోమేశ్వరరావు, ర్యాలీ ఉమామహేశ్వరరావు, బందుల తాతయ్య, ఇగ్గిన రంగారావు, మద్ది సుబ్బారావు, సిపిఎం నాయకులు గోపాల వెంకటరావు, మాగంటి చింతారావు, సిఐటియు నాయకులు తాడిపర్తి గణేశ్వ సోమశేఖర్ పాల్గొన్నారు.

విఆర్‌ఒల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

విఆర్‌ఒల సమస్యలు తక్షణం పరిష్కరించాలని విఆర్‌ఒ సంఘం భీమవరం డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెనడి, పి.సురేష్ తెలిపారు. పాలకోడేరులో విఆర్‌ఒల సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి మండల అధ్యక్షులు స్వామి నాయుడు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన కెనడి, సురేష్ మాట్లాడారు. గ్రేడ్-2 విఆర్‌ఒల ప్రొహిబిషన్ త్వరతగతిన డిక్లేర్ చేయాలన్నారు. 16న నిర్వహించబోయే ఎపి జిఇఇ సమావేశానికి విఆర్‌ఒలంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు టి.దానయ్య, హనుమంతరావు, కోటేశ్వరరావు, ఆర్‌ఒలు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి

ఆచంట : సమ సమాజ నిర్మాణానికి జ్యోతిరావు పూలే ప్రధాన భూమిక పోషించారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు, వైట్ల ఉషారాణి, వర్ధిపర్తి అంజిబాబు, శ్రీదేవి, సత్యవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వల్లూరు గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పూలమాలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్ బాబు, టిడిపి మండల అధ్యక్షులు, కేతా మీరయ్య, సర్పంచి నేలపూడి బేబీ రామమోహన్‌రావు, నాయకులు గొడవర్తి శ్రీరాములు, తమ్మినీడి ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు తాళం శ్రీనివాస్, సుబ్బారావు, ఆకుమర్తి వెంకటలక్ష్మి, మోహన్‌రావు, సిర్రా బాలాజీ, కేతా మురళి, వెంకటరమణ పాల్గొన్నారు.

కొడమంచిలి, జక్కంశెట్టివారి పాలెం, బండివారి పాలెంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ మాట్లాడారు.

పాలకొల్లు : సంఘ సంస్కర్త జ్యోతిరావుపూలే జయంతి స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. తొలుత సీనియర్ నాయకుడు వలవల శ్రీరామ్మూర్తి పూల మాల వేసి నివాళులర్పించారు.

నరసాపురం రూరల్ : స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడారు.

పెనుమంట్ర : పెనుమంట్రలో సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు దిద్దే వెంకట్రావు పూల మాలలు వేసి నివాళు లర్పించారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని పెంకుళ్లపాడు మండల ప్రజా పరిషత్ స్కూల్‌లో జ్యోతిరావు పూలే జయంతి వేడుక ప్రధానోపాధ్యాయులు నేతల రాఘవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సగంచెరువు ఎన్నార్ పేట పాఠశాల ఉపాధ్యాయుడు పంపన లక్ష్మీనారాయణను ఘనంగా సత్కరించారు. పూలే జయంతిని పురస్కరించుకుని మండలంలోని శివదేవుని చిక్కాల నుండి పులపల్లి అంబేద్కర్ భవన్ సెంటర్ వరకు పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో సామాజిక చైతన్య పాదయాత్ర చేపట్టారు.

తణుకు రూరల్ : గోస్తని వంతెన వద్ద ఉన్న పూలే విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి, పి.దక్షిణామూర్తి, వైటి.రామకృష్ణ, టి.రామకృష్ణ, త్రిమూర్తులు, రమణ, సాంబశివరావు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ మాట్లాడారు. అనంతరం పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి బోణం నరసింహరావు, వార్డు మెంబర్లు పొల్లపల్లి శ్రీలక్ష్మి, కొండ ఆదాం, యల్లమెల్లి గణపతి పాల్గొన్నారు.

పెనుగొండ : స్థానిక కంచి కామాక్షమ్మ ఆలయం వద్ద పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు, రాము, గణేష్ పాల్గొన్నారు.

గణపవరం : ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) పిప్పర సచివాలయం వద్ద నిర్వహించిన జయంతి సభలో పాల్గొని మాట్లాడారు. జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.

స్థానిక డిగ్రీ కాలేజీలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావుపూలే చిత్రపటానికి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమవరం : స్థానిక ఝాన్సీలక్ష్మీబాయి బాలికొన్నత పాఠశాలలో జ్యోతిరావు పూలే జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పూలే సామాజిక తత్వవేత్తగా, కుల వివక్షకు వ్యతిరేకంగా తుది శ్వాస వరకు పోరాడరని కొనియాడారు.

యలమంచిలి : మండల కేంద్రం యలమంచిలి సెంటర్‌లో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.క్రాంతికుమార్, మండల అధ్యక్ష కార్యదర్శులు ఇడివి.ప్రసాద్, పి.రామ్మూర్తినాయుడు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించగా, చించినాడ గ్రామంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మాసవరపు సుబ్బారావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉండి : మండలంలోని పాందువ్వ మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో కెవిపిఎస్ గ్రామ సభ్యులు పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో జ్యోతిరావు పూలే గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు దాత విశ్రాంత ఉపాధ్యాయులు దాగారపు గోపాలం బహుమతులు అందించారు.

పాలకొల్లు : పాలకొల్లు వైసిపి కార్యాలయంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ అధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలలో చెల్లెం ఆనంద్‌ప్రకాష్, వైసిపి సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE, ELURU
E.P.10/2019, O.S.55/2013

Between:
వేల్పుల వెంకటేశ్వరరావు ...D.Hr
And
దేవు నాగరాజు, S/o.రామారావు, విద్యుత్ నగర్ కాలనీ, వట్లూరు, పెదపాడు మండలం. ...J.Dr

వేలము నోటీసు

పై నంబరు దావా గ్రంథములోని D.Hr తన బాకీని వసూలు చేసుకునే నిమిత్తం దాఖలు చేసిన ఈ E.P గ్రంథములో దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని **ది.27-04-2023 తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలం వేయ బడును.** వేలంలో పాడుకొనదలచిన వారు ఉదయం 10.30 గం.లకు ఆధార్ కార్డులతో వచ్చి వేలంలో పాల్గొనదలచినదిగా కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు.

షెడ్యూలు: Landed property in an extent of Ac.0-10 cts covered by R.S.No.114/3 situated in kolaparru Grama panchayat, pedapadu mandalam, Eluru SRO, W.G.Dt., within the following boundaries.
EAST: Land of Kadaganchi Lakshmi
SOUTH: Land of Balda Manikyamma
WEST: Land of Ramini China Venkateswara Rao, **NORTH:** Land of Vare Veera Swamy.
An extent of Ac.0-10 cts of land, with all the easementary rights.
D.Hr Value - more than five lakhs
Amin Value - Rs.2,33,000/-

Eluru
Dt.11-04-2023
S.BRAHMAM, Advocate, Eluru. Cell: 94929 32214

మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 723/2022
ఓ.ఎస్.నెం. 277/2015

బిట్వీన్:
భీమవరపు సురేష్ కుమార్ ...వాది
మరియు
కర్నాటి కాంతమ్మ వగైరాలు ...ప్రతివాది
టు:
ఆర్-8: గండికోట నితిన్ కుమార్, తండ్రి: (లేటు) శ్రీనుబాబు, డో.నెం. 28-3-160/2, ఫిరంగుల దిబ్బ, 24వ డివిజన్, ఏలూరు, ఏలూరు జిల్లా.
ఆర్-9: పోట్రు జయలక్ష్మి, భర్త: (లేటు) దుర్గారావు, డో.నెం. 28-3-160/3, ఫిరంగుల దిబ్బ, 24వ డివిజన్, ఏలూరు, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావాలో మిమ్మల్ని చనిపోయిన 3వ ప్రతివాది అయిన గండికోట శ్రీనుబాబు గారి వారసులుగా చేర్చమని కోరుచూ పిటీషను దాఖలు చేసినందున మీకు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందు మీకు ఈ పత్రికా ముఖంగా నోటీసు అమలుకు ఆర్డరు అయి ఉన్నది. కావున వాయిదా తేదీ **ది. 13-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరవగలరు.** లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడును.

జి.వి.నాగేశ్వరరావు
వి.అమర్‌శ్రీనివాస్,
న్యాయవాదులు, ఏలూరు.

మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం.41/2017, ఒ.ఎస్.నెం.59/2016

బిట్వీన్:
దాసరి చిన్నమనాయుడు & others ...డిక్రీ హోల్డర్
మరియు
శ్రీ పోసా శ్రీనివాస్ ...జడ్జిమెంట్ డెటార్

పై నెంబరు వారంటు గ్రంథములో డిక్రీ హోల్డరు తన బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేసిన ఇ.పి. గ్రంథములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ఈ దిగువ తెలియపరిచిన ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్థిని పై కోర్టులో **ది.24-04-2023వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు బహిరగముగా వేలము వేయుదురు.** కావలసిన వారు సదరు వేలములో పాల్గొని నియమ నిబంధనల ప్రకారం షెడ్యూలు దాఖలా ఆస్థిని పాడుకొనవచ్చును.

షెడ్యూలు ఆస్థి: *ఎ-షెడ్యూలు:* పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మండలం, ఏలూరు సబ్ రిజిష్ట్రీ యిలాకా, ఏలూరు పట్టణం, గాంధీ నగరం, శేఖర్ వీధి, బ్లాక్ నెం.10, మున్సిపల్ ఇ-వార్డు టి.యస్.నెం.320 మరియు 954ర్లు దాఖలా చ॥గ॥224-6-0లో దక్షిణం వైపు చ॥గ॥44-0లు స్థలములో పడమర వైపున గల చ॥గ॥22-0-0లు స్థలము, అందులో గల డో.నెం. 20బి-10-17రు గల రేకుల షాపునకు హద్దులు:
తూర్పు: పోసా జయవెంకటరెడ్డి గారి ఆస్థి అ॥10-0లు.
దక్షిణం: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు అ॥19-5లు.
పడమర: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు అ॥10-0లు.
ఉత్తరం: జడ్జిమెంటు డెటార్ గారి తాలూకు ఆస్థి, పోసా జయ వెంకటరెడ్డి గారి ఆస్థి అ॥19-5లు.
డిక్రీ హోల్డర్ కిమ్మత్తు : రూ.2,00,000/-
అమీనా కిమ్మత్తు : రూ.4,30,000/-

ఏలూరు,
10-04-23.
టి.సుబ్బరాయ శర్మ అడ్వకేట్, ఏలూరు. సెల్: 94401 83248

రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరి తగదు

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తోందని, ఇది తగదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ తెలిపారు. అఖిల భారత కిసాన్ సభ పెనుమంట్ర దాట్ల భవనంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా రైతు నాయకుడు ఆదిరెడ్డి సన్యాసిరావు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, కుడిపూడి నాగేశ్వరరావు, ఇందుకూరి వెంకట్రాజు, దిద్దే వెంకట్రావు పాల్గొన్నారు.

16 నుంచి ఐఎఫ్‌టియు మహాసభలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఐఎఫ్‌టియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియు డివిజన్ ప్రధాన కార్యదర్శి దాన వరప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో తిరుపతిలో జరిగే ఐఎఫ్‌టియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఐఎఫ్‌టియు జాతీయ కమిటీ వేసిన పోస్టర్లు మంగళవారం జగన్నాధపురంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ, అమిత్‌షా ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కాల రాసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేటర్ అనుకూలంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ విధానాలపై సమరశీల పోరాటాలకు కార్మిక వర్గాన్ని సిద్ధం చేయటానికి ఈ మహాసభలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో తీపర్తి సత్యనారాయణ, ఎడ్లపల్లి ప్రసాద్, ఉప్పు సుబ్బారావు, మంచాల శ్రీను, అయినం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీల్ చైర్ బహూకరణ

పాలకొల్లు :రోటరీ క్లబ్ ఆఫ్ గోదావరి పాలకొల్లు వారి సౌజన్యంతో పాలకొల్లులోని బ్రాడీపేట ఒకటో వీధిలో నివసిస్తున్న అయిన పర్తి కాశీప్రసాద్‌కి మంగళవారం వీల్ చైర్ బహూకరించారు. ఆపదలో ఉన్న వారికి చేయూత ఇవ్వడానికి రోటరీ క్లబ్ ముందుంటుందని పలువురు చెప్పారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ గోదావరి పాలకొల్లు ప్రెసిడెంట్ చవాకుల సూర్యనరేష్‌బాబు, కుంపట్ల రాంగోపాల్, వినుకొండ శేషాద్రి, కెవిఎస్‌బి పవన్, రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు ప్రెసిడెంట్ ముత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు **ఆలమూరి గాంధీ గారి భార్య ఆలమూరి శ్రీదేవి,** అత్తిలి గ్రామం, అత్తిలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. నా క్లయింటుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయబడినది.

నా క్లయింటు ఆలమూరి శ్రీదేవి ఈ క్రింది షెడ్యూలు క్రయ దస్తావేజు మడిపల్లి చలపతిరావు, మడిపల్లి ఆదినారాయణ, మడిపల్లి జయసూర్య, మడిపల్లి విష్ణు ఈశ్వర మహేశ్వరరావు, మడిపల్లి శ్రీరామచంద్ర నాగభూషణం, మడిపల్లి లీల రత్నశ్రీ, మడిపల్లి జగదీష్, సన్నిధి తులసి సాయిలక్ష్మి, సన్నిధి జాహ్నవి వెంకటనాగ శ్రీమహాలక్ష్మి గార్ల ద్వారా ది.16-10-2021వ తేదీన అత్తిలి సబ్ రిజిష్టరు వారి వద్ద క్రయం పొందిన రిజిష్టరు డాక్యుమెంటు నెం. 3948/2021. ఈ డాక్యుమెంటుకు సంబంధించిన లింకు డాక్యుమెంటు తేదీ 09-09-1985న రిజిష్టరు కాబడిన డాక్యుమెంటు నెం. 2697/1985. ది.30-03-2023వ తేదీన అత్తిలి నుండి తణుకు నా భర్త అయిన ఆలమూరి గాంధీతో కలిసి బండిపై వెళుండగా మార్గ మధ్యలో పడిపోయినది. ఆ డాక్యుమెంటు ఎవరికైనా దొరికిననూ లేక ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ ఈ ప్రకటన ఇచ్చిన ఏడు రోజులలోపు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

షెడ్యూలు హద్దులు

ప॥గో॥జిల్లా, భీమవరం సబ్ రిజిష్టర్, అత్తిలి సబ్ డివిజన్, అత్తిలి గ్రామ పంచాయితీ అందుల రి.స.నెం. 779/8 దాఖలా చ॥గ॥ 119లు ఖాళీ నివేశ్న స్థలమునకు హద్దులు: *తూర్పు:* సన్నిధి ఉమా గారి స్థలం. *పడమర:* సన్నిధి శ్రీను గారి స్థలం. *ఉత్తరం:* రాజవీధి. *దక్షిణం:* మండా మాధవ గారి స్థలం.

పమ్మి వి.నాగ వీరభద్రుడు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
సెల్: 77023 11197

PUBLIC NOTICE

This Public Notice is given on the instructions of My client **Alamuri Sridevi, W/o. Alamuri Gandhi** of Atili Village, Attili Mandal, West Godavari District.

That my client has acaaired the below mentioned schedule property under a Regd. Sale Deed No. 3948/2021 excuted by Madipalli Chelapati Rao, Madipalli Adinarayana, Madipalli Jaya Surya, Madipalli Vishnu Eswara Maheswara Rao, Madipalli Jagadeesh, Sannidhi Tulasi Sai Lakshi, Sannidhi Jahnavi Venkata Naga Srimahalakshi to that document link document ni. 2697/1985 was lost during my client travelling from attili to tanuku by two wheeler on 30-03-2023. Therefore this public notice is issued to all that anybody has of the said original loost documents /claim /right /objection over the schedule property. There shall came forward with documentary proof within Seven (7) Days from the date of this notice to the undersigned else if shall be deemed that there are no claims (or) objections over the shcedule property, and the transaction will be proceeded with.

DOCUMENT SCHEDULE

West Godavari District, Attili Mandal, Attili Village in R.S.No. 779/8 of Site 119 Sq. Yards following boundaries:
East: Site of Sannidhi Uma 74 Feet.
South: Site of Manda Madhava 14.6 Feet.
West: Site of Sannidhi Srinu 73.9 Feet.
North: Road 14.6 Feet. Within the boundaries site with all easementary rights.

PAMMI V.NAGA VEERABHADRUDU
Advocate, Tadepalligudem, W.G.Dist.
Cell: 77023 11197

నేరాలు.. ఘోరాలు..

యువకునిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - కాళ్ల

పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి బాలికను నమ్మించి మోసం చేసిన యువకునిపై కాళ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొండాడ గ్రామానికి చెందిన బాలిక తొమ్మిదో తరగతి చదువుతోంది. బాలిక సమీప బంధువైన అదే గ్రామానికి చెందిన యువకుడు కుందేటి దుర్గాప్రశాంత్ ఏడాది నుంచి ప్రేమ పేరిట ఆమె వెంట పడుతున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలో ఆ బాలిక గర్భం దాల్చింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పెద్దల సమక్షంలో యువకుడిని నిలదీయగా మంచి రోజులు వచ్చాక పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ప్రస్తుతం పెళ్లి చేసుకోవాలని అడిగితే నిరాకరిస్తున్నాడంటూ బాధిత బాలిక చేసిన ఫిర్యాదు మేరకు ఆ యువకునిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మూర్తి తెలిపారు. మంగళవారం భీమవరం డిఎస్‌పి శ్రీనాధ్ బాలిక ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు.

8 మందిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు

ఉండి :మండలంలోని చెరుకువాడకు చెందిన గేదెల రాంబాబుతో మరో ఏడుగురిపై ఉండి పోలీసులు ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. చెరుకువాడ గ్రామానికి చెందిన కన్నీడి సుమలత మార్చి 23న ఆమె పిల్లలను స్కూలుకు పంపుతుండగా అదే ప్రాంతానికి చెందిన గేదెల రాంబాబు మరో ఏడుగురు వ్యక్తులు కులం పేరుతో దూషించి అసభ్య పదజాలంతో తిట్టినందుకు వారిపై ఉండి పోలీసులకు సోమవారం రాత్రి కన్నీడి సుమలత ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం	పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190	సెల్: 83339 88814